సాక్షి
కుమురం భీం






శుక్రవారం : 8 : మార్చి : 2024

## న్యూస్‌రీల్

### ఎల్‌ఆర్‌ఎస్ రుసుం రద్దు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు

ఆసిఫాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం రద్దు చేసి, ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 2022 నుంచి ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేసేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 135 విడుదల చేసిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ విస్మరించిందన్నారు. సామాన్యులకు నష్టం కలిగించే జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, నాయకులు శ్రీనివాస్, ఇంతీయాజ్ లాలా, బుర్స పోచయ్య, అశోక్, నిసార్, జీవన్, భీమేష్, శంకర్ పాల్గొన్నారు.

### పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న ఎన్నికలకు జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని, సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, చేపట్టాల్సిన చర్యలపై గురువారం పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పని చేయాల్సి ఉంటుందన్నారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన ఉండాలని సూచించారు. డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఎన్‌హెచ్‌ఎం' ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు దివాకర్, నాయకులు చిరంజీవి, సంతోషి, పుణ్యవతి, భూదేవి, సునీత, రాకేశ్, శ్రీకాంత్ కొటిల్య, కీర్తి, అన్నపూర్ణ, ముస్తాక్, మాయ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల ప్రజాప్రతినిధులు గురువారం బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ నానయ్య, జెడ్పీటీసీ శ్రీదేవి, వైస్ ఎంపీపీ మనోజిత్ మండల్, ఎంపీటీసీలు జాబరి రాజన్న, జాటోత్ ధన్‌రాజ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ టోంబ్రె మారుతి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకన్న మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మండల అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ పార్టీ గెలుపునకు అహర్నిశలు పాటుపడ్డ తమను సంప్రదించకుండా బీఎస్పీతో బీఆర్‌ఎస్ అధిష్ఠానం పొత్తు పెట్టుకోవడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజీనామా చేస్తున్నా మన్నారు. ఏ పార్టీలో చేరడం లేదని త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# వివక్ష చూపొద్దు

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- సమాజంలో ఆడపిల్లలకు గుర్తింపు దక్కాలి
- విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించాలి
- మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి
- బాలికలను కాపాడుకుంటేనే మానవ మనుగడ
- 'సాక్షి'తో ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థినులు


జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాలం మారింది.. అత్యంత కఠినమైనవిగా భావించే రంగాల్లోనూ మహిళలు సత్తా చాటుతున్నారు. ఇళ్లు, బడి, పని స్థలం.. ఇలా ప్రతిచోటా వివక్ష కొనసాగుతున్నా పురుషులకు సమానంగా రాణిస్తున్నారు. అవమానాలు, అడ్డంకులు దాటుకుని.. అనుకున్నది సాధిస్తున్నారు. మహిళా సమనత్వం, సాధికారత, హక్కులు, స్వేచ్ఛ తదితర వాటిపై అవగాహన కల్పించడం కోసం ఏటా మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తగిన అవకాశాలు కల్పిస్తేనే లింగా సమానత్వం సాధ్యమవుతుందని జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. వైద్య విద్యను పూర్తి చేసుకుని మహిళా శక్తిని చాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మహిళా అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై గురువారం వారు 'సాక్షి'తో అభిప్రాయాలు పంచుకున్నారు.

### మహిళలు రాజకీయంగా ఎదగాలి



ఆసిఫాబాద్: మహిళలు రాజకీయంగా ఎదగాలి. అన్ని రంగాల్లో రాణించాలి. మహిళా రాజకీయ ప్రతినిధులు ఇతరులపై ఆధారపడకుండా స్వతహాగా నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యంగా విద్యావంతులు కావాలి. తమ హక్కులపై అవగాహన ఉండాలి. రాజకీయాలు, ఉద్యోగాల్లో మహిళలపై వివక్ష చూపొద్దు. రిజర్వేషన్ల ప్రభావంతో గతం కంటే మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారు. లక్ష్యం, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చు. కుటుంబంలో ఓ మహిళ విద్యావంతురాలైతే సమాజం రూపురేఖలే మారతాయి.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

### ధైర్యంతో రాష్ట్రం దాటి వచ్చా..



చిన్నతనం నుంచి మెడిసిన్ చదవాలనే కోరిక బలంగా ఉండేది. అందుకోసమే కష్టపడి చదివా. నీట్‌లో ర్యాంకు రావడంతో ఆసిఫాబాద్‌లోని మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. దూరం వెళ్లడంపై కుటుంబ సభ్యులు మొదట భయపడ్డారు. ధైర్యం చేసి రాష్ట్రం దాటి వచ్చా. అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో మహిళలు వెనకడుగు వేయొద్దు. చదువుతోనే అనుకున్నది సాధించగలం. ప్రతీ స్త్రీ చదువుకోవాలి.

– హనియా, కేరళ

### చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



మహిళా రక్షణకు చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలి. నేరాలు జరిగిన వెంటనే తక్షణం స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి. కఠిన శిక్షలు అమలు చేసే చట్టాలు తేవాలి. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశాలు కల్పించాలి.

– నిధి, బిహార్

### వివక్ష.. ఆందోళనకరం



కుటుంబంలో ఆడ, మగ పిల్లలను వేర్వేరుగా చూడొద్దు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి.. సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించాలి. స్త్రీ పట్టుదలతో పని చేస్తే సాధించలేదని ఏదీ లేదు. నగరాలు, పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా బాలికలపై వివక్ష కొనసాగడం ఆందోళనకరం.

– పల్లవి, హైదరాబాద్

### చదువు తప్పనిసరి



బాలికలకు చదువు తప్పనిసరి. అందుకే కష్టమైనా.. దూరమైనా.. మెడిసిన్ చేస్తున్నా. ఉన్నత చదువులు చదువుకుని హక్కులు తెలుసుకుంటేనే మన సమాజంలో బలంగా నిలబడగలం. తల్లిదండ్రులు కూడా బాలికలను వారికి నచ్చిన రంగాల్లో ప్రోత్సహించాలి. అలాగే ప్రభుత్వ బస్సులు, రైళ్లలో మహిళలకు వేధింపులు పెరిగాయి. వారి భద్రతకు చర్యలు తీసుకోవాలి.

– రోమా మీన, రాజస్తాన్

### అరణ్యంలో అతివలు



ఆసిఫాబాద్‌అర్బన్: వన్య మృగాలు సంచరించే అడవుల్లో కొందరు మహిళా అధికారులు ధైర్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోనే దట్టమైన అటవీ ప్రాంతంగా పేరొందిన తిర్యాణి మండలంలో బీట్ అధికారులుగా అడవి సంరక్షణకు పాటుపడుతున్నారు. అడవుల్లో వారికి ఎదురయ్యే కష్టాలు వారి మాటల్లోనే..

### ముందుకు సాగాలి



మాది మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం. అడవు ల సంరక్షణతోపాటు అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ఒకే సమయంలో చేపట్టడం కష్టతరమైనా బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నా. అటవీశాఖలో పని చేసే మహిళలకు కొన్ని వెసులుబాటు కల్పిస్తే మేలు. చిన్నతనంలో తండ్రిని కోల్పోయినా కుంగిపోలేదు. ఉద్యోగంలో చేరిన మొదట్లో కనీస అవగాహన కూడా లేదు. – స్వప్న,

బీట్ అధికారి, దంతన్‌పల్లి, మం.తిర్యాణి

### అప్రమత్తంగా ఉండాలి



మాది మంచిర్యాల జిల్లా జన్నారం మండలం నాగసముద్రం. కుమురంభీం జిల్లా అడవులు చాలా దట్టమైనవి. ఇక్కడ విధులు నిర్వర్తించడం కష్టంతో కూడుకున్న పని. కొన్ని సందర్భాల్లో కలప తరలిపోకుండా రాత్రిపూట కూడా పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. పోడు భూముల సమస్య, పెద్ద పులుల సంచారం, కలప స్మగ్లింగ్ కారణంగా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. – సఫియా బేగం,

బీట్ అధికారి, మాదారం, మం.తిర్యాణి

### బాధితులకు భరోసా అవసరం



మానసిక, లైంగిక వేధింపులకు గురైన మహిళలు ఇప్పటికీ బయటికి చెప్పుకోలేకపోతున్నారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించినప్పుడే వారు ధైర్యంగా ఫిర్యాదు చేయగలుగుతారు. మారుమూల గ్రామాల్లో రక్షణ చట్టాలపై అవగాహన లేక వేధింపులకు గురవుతున్నారు. ప్రతీ మహిళ నిర్భయంగా మాట్లాడే వాతావరణం కల్పించాలి.

– ముస్కాన్, ఉత్తరప్రదేశ్

### ప్రాతినిధ్యం పెరగాలి



రాష్ట్ర, కేంద్ర చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి. వారి వాయిస్‌ను ప్రపంచానికి తెలిపే అవకాశం కల్పించాలి. అలాగే స్త్రీల సంక్షేమం కోసం కేటాయిస్తున్న బడ్జెట్ కూడా పెంచాలి. వసతి గృహాల్లో మహిళా అధికారులనే నియమించేందుకు చర్యలు తీసుకోవాలి. రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ము, గవర్నర్‌గా తమిళి సై వంటి మహిళలు ఉండటం గర్వంగా.. గౌరవంగా భావిస్తున్నా.

– శ్రీనిత్య, ఆసిఫాబాద్

## 'పీఎం విశ్వకర్మ'తో చేతివృత్తులకు చేయూత

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తులకు చేయూతనందిస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతి, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ కోవ హన్మంతరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ రఘుతో కలిసి లబ్ధిదారుల గుర్తింపుపై పంచాయతీ అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 రకాల చేతివృత్తుల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారి వివరాలను జిల్లాస్థాయి అమలు కమిటీకి సమర్పించాలన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి 18ఏళ్లు నిండిన వారు, కుటుంబంలో ఒక్కరికి అవకాశం కల్పించాలని సూచించారు. అలాగే పంచాయతీల్లో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలన్నారు. హరిత హారం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించాలని, తడిపొడి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, శిక్షకుడు రాజేశ్‌యాదవ్, డీఎల్‌పీవోలు ఉమర్ హుస్సేన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వెలుగుల్లో శైవక్షేత్రాలు


విద్యుత్ వెలుగుల్లో వాంకిడి శివకేశవ ఆలయం


నంబాల శివాలయం


ఈజ్‌గాం శివాలయం

రెబ్బెన/వాంకిడి/కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. రెబ్బెన మండలం నంబాలలోని ప్రసన్న పరమేశ్వర ఆలయం, దుర్గాపూర్‌లోని శివాలయం, వాంకిడిలోని శివకేశవ ఆలయం, కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాంలోని శివమల్లన్న ఆలయాలను విద్యుత్ వెలుగులతో అలంకరించారు. శుక్రవారం నంబాలలో శివపార్వతుల కల్యాణంతో పాటు సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. వాంకిడి మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో నేడు సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించనున్నారు. చిక్లీవాగు తీరంలో నిర్వహించే జాతరకు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలివస్తారు. ఈస్‌గాం శివాలయాన్ని దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు లేకుండా సాధారణ(ఉచిత) దర్శనం, ప్రత్యేక దర్శనం లైన్లు ఏర్పాట్లు చేశారు.

# ఆమెకు ప్రాతినిధ్యమేది..?

- చట్టసభల్లో మహిళలు అంతంతే
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా తక్కువే
- రాజకీయాల్లో ఉన్నా పదవులు అందని ద్రాక్షే
- 33శాతం మహిళా కోటా అమలైతేనే ఊరట

**ఉమ్మడి జిల్లాలో స్త్రీ -పురుష ఓటర్లు**

| నియోజక వర్గం | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| సిర్పూర్ | 1,14,484 | 1,14,359 | 12 | 2,28,855 |
| చెన్నూర్ | 95,974 | 97,264 | 07 | 1,93,245 |
| బెల్లంపల్లి | 86,802 | 88,530 | 13 | 1,75,345 |
| మంచిర్యాల | 1,38,472 | 1,40,559 | 25 | 2,79,056 |
| ఆసిఫాబాద్ | 1,12,510 | 1,14,056 | 16 | 2,26,582 |
| ఖానాపూర్ | 1,09,508 | 1,14,445 | 13 | 2,23,966 |
| ఆదిలాబాద్ | 1,19,154 | 1,24,375 | 06 | 2,43,535 |
| బోథ్ | 1,02,333 | 1,08,580 | 02 | 2,10,915 |
| నిర్మల్ | 1,21,070 | 1,35,057 | 20 | 2,56,147 |
| ముథోల్ | 1,23,208 | 1,30,378 | 18 | 2,53,604 |
| మొత్తం | 11,23,515 | 11,67,603 | 132 | 22,91,250 |

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అన్నింటా ఆమె సగం అనే మాటలు చట్టసభల అవకాశాల్లో అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం అసమానతను తెలియజేస్తోంది. ఉమ్మడి జిల్లా జనాభా, ఓటర్ల పరంగా చూస్తే మగవారితో సమానంగా.. కొన్నిచోట్ల మహిళలే అధికంగా ఉన్నారు. కానీ చట్టసభలకు ఆమడదూరంలో ఉన్నారు. రాజకీయ పార్టీలు సైతం మహిళలకు టికెట్లు ఇచ్చి ప్రోత్సహించడమే కరువైంది.

**అందని అవకాశాలు..**

73ఏళ్ల ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పది అసెంబ్లీ స్థానాల్లో ప్రతీ ఐదేళ్లకోసారి సగటున 15మంది చొప్పున సుమారు 150పైగా మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో మొత్తంగా ఏడుగురే మహిళా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ముగ్గురు రెండు సార్లు గెలిచారు. ఇక పెద్దపల్లి, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 36మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. 1998, 1999 ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున డాక్టర్ సుగుణకుమారి ఎంపీగా ఎన్నికయ్యారు. మిగతా ఏ ఒక్కరికి అవకాశం దక్కలేదు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మహిళలెవరూ ఎన్నిక కాలేదు.

**33శాతం కోటా అమలైతే**

గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో 33శాతం సీట్లు మహిళలకు రిజర్వు చేసే 128వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడితే పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టం అమలులోకి వస్తే ఇప్పుడున్న పది స్థానాల్లో కనీసం రెండు నుంచి మూడు స్థానాల వరకు మహిళలకే దక్కనున్నాయి. ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను ఒకటే జనరల్ స్థానం ఉండనుంది. భవిష్యత్తులో మహిళా నాయకులకు అవకాశం మెరుగుపడనున్నాయి.

### అవకాశాలు ఇవ్వాలి



రాజకీయంగా ఎంతోమంది మహిళలు కష్టపడుతున్నా వారికి తగిన అవకాశాలు రావడం లేదు. డబ్బు, హోదా ఉన్న మగవారి ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితి మారాలి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, చట్టసభల్లోనూ అవకాశాలు కల్పిస్తుందనే భరోసా ఉంది.

– రామిళ్ల రాధిక, కాంగ్రెస్ నాయకురాలు

### మహిళా బిల్లుతో మేలు



భవిష్యత్‌లో మహిళా బిల్లుతో చట్టసభల్లో అవకాశాలు మెరుగుపడనున్నాయి. 33శాతం కంటే 50శాతం అమలు చేస్తే అందరికీ సమాన అవకాశాల ఇచ్చినట్లు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– అమురాజుల శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి

## విద్యార్థులకు వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్/వాంకిడి: పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వాంకిడిలోని పరీక్ష కేంద్రాన్ని గురువారం కలెక్టర్ అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి స్పెషల్ డ్రైవ్ రికార్డులు, దరఖాస్తులు తనిఖీ చేశారు. తహసీల్దార్ రోహిత్‌తో మాట్లాడారు. మండల కేంద్రంలోని ఇంద్రానగర్‌లో డ్రెయినేజీలను పరిశీలించారు. కాగా.. గురువారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 3,730 మంది విద్యార్థులకు 3,621 మంది హాజరు కాగా 109 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,057 మందికి 2,982 హాజరు కాగా 75 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 673 మందికి 639 మంది హాజరు కాగా 34 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో శంకర్ తెలిపారు. రెబ్బెన, వాంకిడి, తిర్యాణిలోని కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు భద్రసేన్, రాహుఫ్ పరిశీలించారు.

## క్లుప్తంగా

### పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


సత్తయ్య మృతదేహం

లక్సెట్టిపేట: పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన సొప్పరి సత్తయ్య (61)కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం చెల్లంపేట సమీపంలోని పొలంవద్దకు వెళ్లి పొలానికి కొట్టే మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

శ్రీరాంపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా రాణించాలన్నారు. ధైర్యంగా ముందుకెళ్లి తమకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా మంది మహిళలు కుటుంబ బాధ్యతలు మోస్తూనే కంపెనీలను దిగ్విజయంగా నడిపిస్తున్నారన్నారు. జీఎం సతీమణి, ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అనేక వృత్తి కోర్సులు ఏర్పాటు చేసి మహిళలను ప్రయోజకులను చేస్తున్నామన్నారు. ఇందులో శిక్షణ పొందిన చాలామంది మహిళలు సొంత యూనిట్లు పెట్టుకొని ఆర్థికంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళలను జీఎం దంపతులు సన్మానించి జ్ఞాపిక అందించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంజీవరెడ్డి కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, డీజీఎం అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, సభ్యులు తిరుమల, మంగ, సునీత, భారతి పాల్గొన్నారు.

### లక్ష్యంతో పనిచేయాలి



మహిళలు తమ కంటూ ఒక లక్ష్యం ఏర్పర్చుకుని దానిని సాధించేందు కోసం పని చేయాలి. అప్పుడే సక్సెస్ అవుతాం. సింగరేణి ఉద్యోగంలో చేరడానికి మహిళలు ఏమాత్రం సంకోచించవద్దు. గనులపై కూడా మహిళలకు ప్రత్యేక రెస్టు హాల్స్ ఏర్పాటు చేయాలి.
– ఏ.అఖిల, సీనియర్ అసిస్టెంట్

### మహిళల అభ్యున్నతికి కృషి



సింగరేణి కంపెనీ మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తోంది. వృత్తి శిక్షణ కోర్సులు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. వేలాది మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకుని నేడు సొంత యూనిట్లు పెట్టుకొని ఆర్థికంగా రాణిస్తున్నారు. మహిళా శక్తి చాలా గొప్పది. ఆకాశమే హద్దుగా పని చేయాలి. దీనికి సింగరేణి అన్నిరకాల తోడ్పాటునందిస్తోంది.– బీ.రాధాకుమారి, సేవా అధ్యక్షురాలు, శ్రీరాంపూర్

- సింగరేణిలో రాణిస్తున్న మహిళా ఉద్యోగులు
- కారుణ్య ఉద్యోగాలతో పెరిగిన మహిళల సంఖ్య
- పురుషులతో సమానంగా విధులు
- అన్నిరంగాల్లో చెరగని ముద్ర
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

# నల్లనేలలో నారీ‘భేరి’

శ్రీరాంపూర్: ఎంతో కష్టతరమైన సింగరేణి గనుల్లో కూడా మహిళలు తమ సత్తా చాటుతున్నారు. నింగి, నేల ఏదైనా సరే తమకు అవకాశం కల్పిస్తే పురుషులతో సమానంగా రాణిస్తామని నిరూపించుకుంటున్నారు. సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలు మొదలైన తరువాత మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. చాలా మంది కార్మికులు తమ కొడుకుల స్థానంలో కూతుర్లకు డిపెండెంట్ ఉద్యోగం కల్పిస్తున్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోనే సుమారు 215 మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారు. జీఎం కార్యాలయాల్లో, పలు డిపార్టుమెంట్లు, స్టోర్స్, వర్క్‌షాప్‌లలో, భూగర్భ గనులు, ఓసీపీల్లో విధులు నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కథనం.


వర్క్‌షాప్‌లో వైండింగ్ పనులు చేస్తున్న మహిళా ఉద్యోగులు (ఫైల్)

### భయపడితే ఏదీ సాధించలేం



బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివా. మా నాన్న స్థానంలో డిపెండెంట్ ఉద్యోగం కింద కంపెనీలో చేరా. ముందుగా ఇబ్బంది అనిపించినా నాకు నేనే ధైర్యం తెచ్చుకొని పని చేయడం మొదలు పెట్టాక అంతా తేలికైంది. అధికారులు సహకరిస్తున్నారు. మహిళలు ఎక్కడైనా ధైర్యంగా పనిచేయాలి. అప్పుడే అందరూ సహకరిస్తారు. భయపడితే ఏదీ సాధించలేం.
– బీ.సోని, బదిలీ వర్కర్, ఆర్కే 6 గని

### వర్క్‌ని ఎంజాయ్ చేయాలి



వర్క్‌ని ఎంజాయ్ చేస్తూ పనిచేయాలి. అదే సమయంలో ఫైటింగ్ స్పిరిట్ కూడా ఉండాలి. అప్పుడే మహిళలు రాణిస్తారు. మూడేళ్లుగా సింగరేణిలో చేస్తున్నా. బయటివారికి సింగరేణిలో మహిళలు ఎలా ఉద్యోగం చేస్తారో అనిపిస్తుంది. మహిళలు భయపడితే ఏం సాధించలేరు. అడుగు ముందుకేస్తేనే ఏదైనా సాధించగలరు.
– కోదాటి ప్రియాంక, జనరల్ మజ్దూర్, జీఎం కార్యాలయం

### డాక్టర్ చదివించడమే లక్ష్యంగా..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన నిచ్చకోల స్వప్న, రాజన్న దంపతులకు హన్షిక ఒక్కరే సంతానం. పెళ్లైన తర్వాత పాపైనా బాబైనా ఒక్కరినే కనాలని నిర్ణయించుకున్నారు. హన్షిక జన్మించాక దంపతులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్నారు. కుమార్తెను ఉన్నతస్థితికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎస్‌పీడీసీఎల్‌లో చిరు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రాజన్న వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎన్నికష్టాలు వచ్చినా ఒక్కగానొక్క కూతుర్ని డాక్టర్ కోర్సు చదివించాలనుకున్నారు. 1 నుంచి పదోతరగతి వరకు బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో చదివించారు. ప్రస్తుతం ఆమెకు నీట్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. తమ కూతురు డాక్టరై పేదలకు వైద్యం అందించి తమ కుటుంబ గౌరవాన్ని ఇనుమడింపజేస్తుందని ఆ దంపతులు ఆశిస్తున్నారు.


కూతురు హన్షికతో స్వప్న, రాజన్న

### యువతకు ఆదర్శం సాహితిరెడ్డి

తాంసి: మండల కేంద్రానికి చెందిన కంది గోవర్ధన్‌రెడ్డి, జయశ్రీ దంపతులకు కుమార్తె సాహితిరెడ్డి ఒక్కరే సంతానం. వారిది వ్యవసాయ కుటుంబం. కూతుర్ని ఉన్నతంగా చదివించాలని నిర్ణయించుకున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు రాంపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో, 8 నుంచి పదో తరగతి వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో చదివించారు. నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన సాహితిరెడ్డి వరంగల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఎంబీబీఎస్ పూర్తి కావడంతో ప్రస్తుతం జనరల్ సర్జన్ పరీక్షకు సన్నద్ధమవుతోంది. తల్లిదండ్రుల లక్ష్యం నేరవేరుస్తున్న సాహితిరెడ్డి నేటి యువత, మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. యువత అవకాశాలు అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో ముందుకెళ్లాలని సూచిస్తోంది.


తల్లిదండ్రులు గోవర్ధన్‌రెడ్డి, జయశ్రీతో సాహితిరెడ్డి

### తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...


కూతురు సంగీతతో ప్రహ్లాద్

సిరికొండ: మండలంలోని రాంపూర్(బి) గ్రామానికి చెందిన సూర్యవంశి ప్రహ్లాద్, బాగుబాయి దంపతులకు కుమార్తె సంగీత ఒక్కరే సంతానం. చిన్ననాటి నుంచి సంగీత చదువులో ముందుండేది. పెద్దయ్యాక ఏంచేస్తావ్ అని అడిగితే డాక్టర్ అవుతానని చెప్పేది. కూతురు చిన్ననాటి మాటలను నిజం చేయాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. 1నుంచి పదో తరగతి వరకు ఇంద్రవెల్లి మండలంలోని దన్నాడ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో, నీట్‌లో ప్రతిభ కనబరిచి ఫిలిప్పిన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. గతేడాది నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే వైద్యవిద్య పూర్తిచేశానని పేర్కొంది.

### కూతురు మాటే వేదవాక్కు

వేమనపల్లి: కొడుకులు లేని ఆ దంపతులకు కూతురు మాటే వేదవాక్కు. జెడ్పీటీసీ రుద్రభట్ల స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్ కుమార్ దంపతులకు ఏకైక సంతానం కుమార్తె స్మృతి. గారాల పట్టి నిర్ణయాలే ఆ ఇంట్లో వేదవాక్కు. ఏ శుభకార్యం చేయాలన్నా.. కొత్తగా ఏ పనులు ప్రారంభించాలన్న ఆమె చేతుల మీదుగానే ప్రారంభిస్తారు. చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ప్రస్తుతం స్మృతి చెన్నూర్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. మంచి నడవడిక, క్రమశిక్షణతో ఎదుగుతోంది. ఆమె పుట్టినరోజున పేదలకు అన్నదానం, ఆర్థికసాయం చేస్తున్నారు.


స్మృతితో స్వర్ణలత, సంతోష్

### ఒక్కరే ముద్దు..

దండేపల్లి: ప్రస్తుత రోజుల్లో ఆడైనా మగైనా ఒక్క సంతానమే మంచిదని అంటున్నారు దండేపల్లికి చెందిన గడ్డం రమేశ్ గౌడ్, ప్రశాంతి దంపతులు. వారికి ఏకైక సంతానంగా శిఖర జన్మించింది. పుట్టింది ఆడపిల్ల అయినా ఒక్క సంతానంతోనే సరిపెట్టుకున్నారు. చిన్నారిని ఎంతో ఆప్యాయంగా, అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. బాగా చదివించి ఉన్నత స్థానంలో నిలపాలన్నదే లక్ష్యం అంటున్నారు.


శిఖరతో రమేశ్‌గౌడ్, ప్రశాంతి

### సమాజంలో గుర్తింపు ఉండాలని..



లక్సెట్టిపేట: 2002లో లా డిగ్రీ పూర్తిచేశా. 2005లో వ్యాపారవేత్త అనిల్‌కుమార్‌తో వివాహమైంది. మాకు ఇద్దరు సంతానం. సమాజంలో తమకంటూ గుర్తింపు ఉండాలని కుటుంబ సభ్యులు, భర్త ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యా. 2012లో పబ్లిక ప్రాసిక్యూటర్, 2013లో జూనియర్ సివిల్ జడ్జి అయ్యా. 2022లో సీనియర్ సివిల్ సివిల్ జడ్జిగా ప్రమోషన్ వచ్చింది.
– అర్పిత, సీనియర్ సివిల్ జడ్జి



### పరీక్ష బాగా రాయలేదని పస్తులు ఉంచారు

- సబ్జెక్ట్ టీచర్ లేక సమాధానాలు రాయలేకపోయిన విద్యార్థినులు
- పరీక్ష కేంద్రంలోనే కంటతడి
- విషయం తెలిసి.. విద్యాలయంలోకి రానివ్వని సిబ్బంది


చింతలమానెపల్లి కేజీబీవీ ఎదుట విద్యార్థినులు

చింతలమానెపల్లి(సిర్పూర్): పరీక్ష సరిగా రాయకుండా తమ పరువు తీశారని విద్యార్థినులకు భోజనం పెట్టకుండా పస్తులు ఉంచిన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం(ఎంపీసీ) చదువుతున్న 15 మంది విద్యార్థినుల్లో 14 మంది గురువారం కౌటాలలోని పరీక్ష కేంద్రంలో మ్యాథ్స్(ఏ) పరీక్షకు హాజరయ్యారు. గణితం బోధించే టీచర్ లేకపోవడంతో సమాధానాలు రాయలేక బాలికలు పరీక్ష కేంద్రంలో కంటతడి పెట్టుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బంది సముదాయించారు. విద్యార్థినులు రోదించిన విషయం బయటికి రావడంతో కేజీబీవీ సిబ్బంది బాలికలను విద్యాలయంలోకి రానివ్వలేదు. భోజనం సైతం పెట్టలేదు. ఆకలి అవుతుందని అన్నం పెట్టాలని ఉపాధ్యాయులు పార్వతి, స్వర్ణికలను అడగగా.. ఇన్‌చార్జి ఎస్‌వో భోజనం పెట్టవద్దన్నారని తెలిపారు. పరీక్ష సరిగా రాయనివారికి అన్నం పెట్టొద్దని, మాట వినకపోతే పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడతామని బెదిరించారని విద్యార్థినులు ఆరోపించారు. సాయంత్రం వరకు వేచి చూసిన బాలికలు చివరికి తల్లిదండ్రులకు విషయం తెలిపారు. పాఠశాలకు వచ్చిన వారు పిల్లలతో కలిసి గ్రామంలోని ఓ ఇంట్లో బస చేశారు. స్థానికులే వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ విషయమై ఎస్‌వో శ్రీదేవిని సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఎంఈవో సోమయ్యను సంప్రదించగా.. కేజీబీవీలో గణితం బోధనకు ఉపాధ్యాయులు లేని విషయం తనకు తెలియదన్నారు. తల్లిదండ్రులే బాలికలను తీసుకెళ్లారని తెలిపారు.

#### తల్లిదండ్రుల ఫిర్యాదు

విద్యార్థినులకు భోజనం పెట్టకుండా, పాఠశాల బయట ఉంచిన వేధించిన ఘటనపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవి, సిబ్బందిపై జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేపడతామని ఆ శాఖ అధికారి బూర్ల మహేశ్ తెలిపారు.

### మెరుగైన విద్యనందించాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండలంలోని జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలను గురువారం డీటీడీవో రమాదేవితో కలిసి సందర్శించారు. విద్య, వైద్యం, భోజనం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠాలు బోధించి విద్యార్థులతో లెక్కలు చేయించారు. అనంతరం జోడేఘాట్‌లోకి కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాధి వద్ద పూజలు చేసి, మ్యూజియాన్ని సందర్శించారు. అంతకు ముందు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట ఏటీడీవో పురుషోత్తం, హెచ్‌ఎం ఆత్రం మోతీరాం, క్యూరేటర్ దుందేరావు, గ్రామపెద్ద కుమురం రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.


భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

### జీవితంపై విరక్తితో ఆత్మహత్య

సిర్పూర్(టి): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఏఎస్సై రాములు తెలిపారు. గోవింద్‌పూర్ కాలనీకి చెందిన థోర్ పరశురాం (43)కు ముగ్గురు కుమార్తెలు సంతానం. పెద్దకుమార్తెకు వివాహమైంది. మిగిలిన ఇద్దరికి వివాహం ఎలా చేసేదని మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం కాలనీకి సమీపంలో ఉన్న పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య థోర్ విఠబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.